సాక్షి తిరుపతి

ఆదివారం । 3 । నవంబర్ । 2024



కిక్కిరిసిన 'కొండ'

తిరుమల శ్రీవారి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. క్యూ కంపార్ట్‌మెంట్లు అన్ని నిండిపోయాయి.

- 8లో



ఖాళీ జాగా.. కనిపిస్తే పాగా!

చంద్రగిరి పంచాయతీలోని ఇందిరమ్మ కాలనీలో ఖాళీ ప్లాట్లను టీడీపీ నేతలు యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారు.

- 8లో



మానవమృగాన్ని శిక్షించండి

ఏఎంపురంలో చిన్నారిని కిరాతకంగా హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని పుత్తూరులో ర్యాలీ చేపట్టారు.

- 8లో

న్యూస్‌రీల్

తిరుపతిలో జాబ్‌మేళా రేపు

తిరుపతి అర్బన్ : తిరుపతిలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ సెంటర్‌లో సోమవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్.లోకనాథం తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఆఫీస్, సీడప్, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఉదయం 9గంటల నుంచి మేళా ప్రారంభమవుతుందని వెల్లడించారు. పలు కంపెనీ ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు చేపట్టనున్న జాబ్ మేళాకు పదోతరగతి నుంచి ఇంటర్ ఏదైనా డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా కోర్సులు పూర్తి చేసిన వారు అర్హులని వివరించారు. ఆసక్తిగల వారు ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. సర్టిఫికెట్లతోపాటు ఆధార్ జెరాక్స్‌లు అందించాలని చెప్పారు. వివరాల కోసం 9703437472 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న అభయం



ఊరేగుతున్న కల్యాణ వేంకటేశ్వర స్వామి

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వర స్వామి శనివారం బంగారు తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు, అభిషేకాలు చేశారు. తదుపరి విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామివారికి ఆలయ ఆవరణలోని కల్యాణ మండపంలో వైఖానస ఆగమోక్తంగా కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవను చేపట్టారు. తదుపరి అలంకార భూషితుడైన స్వామివారు తన దేవేరులతో కలిసి బంగారు తిరుచ్చి వాహనాన్ని అధిష్టించి నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వెంకటస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యం

తిరుమల : బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు కార్మికశాఖ సహాయ కమిషనర్ ఎస్.చిన్న లాలెప్ప తెలిపారు. శనివారం కార్మికశాఖ అధికారులు, ప్రగతి స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు, ఐసీడీఎస్, సమగ్రశిక్ష అభియాన్, పోలీసులతో కలిసి తిరుమలలోని పలు షాపింగ్ మాల్స్, హోటళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడుగురు బాల కార్మికులను గుర్తించారు. పిల్లలను ఎట్టి పరిస్థితుల్లోనూ పనిలో పెట్టుకోకూడదని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎల్‌ఓలు జి.రంగనాథ్, శ్రీమన్నారాయణ, ప్రవీణ్ కుమార్, ప్రగతి సంస్థ జిల్లా ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ రాజారెడ్డి, ఏఎస్ఐ మధు, సీడీపీఓ శివశంకర్, సమగ్రశిక్ష అభియాన్ వరలక్ష్మి పాల్గొన్నారు.

వర్సిటీ సమాచార సంపుటి విడుదల



వార్తా సమాచార సంపుటిని విడుదల చేస్తున్న వీసీ, అధ్యాపకులు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలోని సెంట్రల్ నెట్‌వర్కింగ్ ఫెసిలిటీ సౌజన్యంతో వర్సిటీ సమాచారం పేరుతో తీసుకువచ్చిన వార్తా సంపుటిని శనివారం వీసీ వి.ఉమ విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ వర్సిటీలో జరిగే బోధన, పరిశోధనల విస్తరణ తదితర విషయాలపై దినపత్రికల్లో వచ్చే వార్తలను సేకరించి విశ్లేషణాత్మక వ్యాసాలతో ప్రత్యేక వార్తా సంపుటిలో పొందుపరుస్తామని తెలిపారు. వార్తా సమాచార సంపుటితో వర్సిటీలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయాలన్నదే ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ బి గీతావాణి, సీఎన్‌ఎఫ్ డైరెక్టర్ నీలిమ, డాక్టర్ జి సుమన, సిబ్బంది పాల్గొన్నారు.

ఘోరం.. పాపం



బోరున విలపిస్తున్న చిన్నారి తల్లి

అభం శుభం తెలియని చిన్నారి నిండు ప్రాణాలు కర్కశత్వానికి బలైపోయాయి. కల్మషం లేని చిరునవ్వులు చీకటిలో కలిసిపోయాయి. ముద్దులొలికే మాటలు మూగబోయాయి. మానవమృగం వికృత చేష్టలను అడ్డుకోలేక చిట్టి చేతులు నలిగిపోయాయి. కామాంధుడి కబంధ హస్తాల నుంచి కాపాడేవారి కోసం ఎదురు చూసిన పసి మనసు ఆశలు ఆవిరయ్యాయి. కనికరం లేకుండా ఆ కిరాతకుడు క్రూరంగా కొరుకుతూ.. రక్కుతూ.. పీక తొక్కేస్తుంటే అశువులు అనంతవాయువుల్లో కలిసిపోయాయి. ఈ క్రమంలోనే అపురూపంగా పెంచుకున్న బిడ్డను నిర్జీవంగా చూసి తల్లిదండ్రుల నవనాడులు కుంగిపోయాయి. నిరుపేద గిరిజన బతుకుల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

- మూడున్నరేళ్ల చిన్నారిని చిదిమేసిన మానవమృగం
- చాక్లెట్ ఆశ చూపి తీసుకెళ్లి కిరాతకం
- నిందితుడిని కఠినంగా శిక్షించాలంటున్న జనం
- కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న కుటుంబీకులు
- బిడ్డ మృతదేహం చూసి సొమ్మసిల్లిపడిపోయిన తల్లిదండ్రులు

సాక్షి ప్రతినిధి, తిరుపతి : పాపం.. ఆ చిన్నారికి తెలియదు.. తనకు చాక్లెట్ ఇచ్చింది ఒక మృగం అని.. అది తనను కబళిస్తుందని. దగ్గరకు పిలిస్తే నవ్వుతూ వెళ్లింది. చాక్లెట్ ఇస్తే సంతోషపడింది. ఎత్తుకుంటే మురిసిపోయింది. పక్కకు తీసుకెళుతుంటే ఆడుకోవడానికేమో అని ఆనందపడింది. కానీ, ఆ మానవమృగం మనసులో వికృతాన్ని పసిగట్టలేకపోయింది. ఆ కామాంధుడి పశువాంఛకు బలైంది. తిరుపతి జిల్లా వడమాలపేట మండలం ఏఎం పురం గిరిజన కాలనీకి చెందిన మూడున్నరేళ్ల చిన్నారిపై సుశాంత్ అనే కిరాతకుడు శుక్రవారం సాయంత్రం లైంగిక దాడికి పాల్పడి.. ఆపై హత్య చేసి ఘటన ప్రతి ఒక్కరినీ కలచివేస్తోంది. వినడానికే ఇబ్బందిగా ఉన్న ఈ దారుణ ఘటనను ఊహిస్తేనే గగుర్పాటు కలుగుతుంది. అప్పటి దాకా తల్లితో నవ్వుతూ.. ఆడుకుంటున్న చిన్నారి మాయ మాటలు విని.. మద్యం మత్తులో ఉన్న దుర్మార్గుడి చేతిలో ప్రాణాలు కోల్పోయింది. పసిబిడ్డపై లైంగిక దాడికి పాల్పడిన, మురుగు కాలువలో తొక్కి చంపేశాడనే విషయం తెలుసుకుని ప్రతి ఒక్కరి మనసు ఆవేదనతో నిండిపోయింది. శనివారం ఉదయం పుత్తూరు ప్రభుత్వాస్పత్రి వద్ద చిన్నారి తల్లిదండ్రుల రోదనలు చూపరుల హృదయాలను కలిచివేశాయి. కిరాతకుడి చేష్టలకు ఆ చిన్నారి ఎంతగా తల్లడిల్లిపోయిందోనని కేవీబీ పురం ఓళ్లూరు గిరిజన కాలనీ వాసులు కన్నీటి పర్యంతం అయ్యారు.



పోస్టుమార్టం అనంతరం చిన్నారి మృతదేహాన్ని తీసుకొచ్చిన సిబ్బంది

నాలుగు రోజుల ముందే వచ్చాం

''దీపావళి పండుగ జరుపుకుందామని వస్తే మా ఇంటి దీపం ఆర్పేసాడు. నీకు దయలేదా దేవుడా'' అంటూ చిన్నారి తల్లి కన్నీరుమున్నీరైంది. ''మా ముద్దుల పట్టీని ఆ పశువు నాశనం చేసి చంపుతుంటే ఏం చేస్తున్నావు దేవుడా'' అంటూ విలపిస్తున్న ఆ తల్లిని ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు. ''అత్తగారింటికి నాలుగు రోజుల ముందే వచ్చాం. మాతో కలిసి తిరిగిన వాడే ఇలాంటి ఘోరం చేస్తాడని ఊహింలేదు. ముద్దు మాటలతో మురిపించే పసిబిడ్డను ఈ విధంగా బలి తీసుకునేందుకు వాడికి మనసెలా వచ్చిందో..? ఇది మనుషులు ఉండే లోకమేనా..?'' అంటూ చిన్నారి తండ్రి గుండెలవిసేలా రోదించాడు.



పండుగకు గిరిజన దంపతులు వచ్చిన ఇల్లు

దేవుడా ఏంటీ దారుణం

దీపావళి పండుగ రోజున ఇంతటి దారుణం ఏంటి దేవుడా అంటూ ఏఎంపురం వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారి తల్లిదండ్రులతో కలిసి గ్రామం మొత్తం పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలివచ్చింది. ఎవరిని ఎవరు ఓదార్చాలో తెలియని స్థితిలో.. ఒకరిని చూసి మరొకరు కన్నీటి పర్యంతమయ్యారు. చిన్నారి మృతదేహానికి త్వరగా పోస్టుమార్టం చేసి తమకు అప్పగించాలని అధికారులను వేడుకున్నారు. ఉదయం 11 గంటలకు కూడా పోస్టుమార్టం చేపట్టకపోవడంతో మండిపడ్డారు. అధికారులను నిలదీశారు. పరామర్శించేందుకు వచ్చిన మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామితో తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ క్రమంలోనే మాజీ మంత్రి ఆర్కే రోజా, టీటీడీ బోర్డు మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఆస్పత్రికి చేరుకుని బాధిత కుటుంబీకులను ఓదార్చారు. ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఘటన జరిగింది ఇలా..

- ఏఎంపురం ఎస్టీ కాలనీలో శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి చిన్నారి కనబడలేదు
- రాత్రి 7 గంటల వరకు తల్లిదండ్రులు పాప ఆచూకీ కోసం వెతికి పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- వడమాలపేట పోలీసులు రాత్రి 8 గంటలకు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.
- రాత్రి 9గంటలకు పాప తల్లిదండ్రుల అనుమానం మేరకు నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు.
- నిందితుడి నుంచి వివరాలు రాబట్టి, రాత్రి 11 గంటలకు స్కూల్ పక్కన ఉన్న మురుగు కాలువలో పాప మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
- శనివారం వేకువజామున చిన్నారి మృతదేహాన్ని పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.
- 10 గంటలకు పుత్తూరుకు వచ్చిన ఎస్పీ సుబ్బరాయుడు నిందితుడి అరెస్ట్ చూపించారు.
- మధ్యాహ్నం 1.30 గంటలకు చిన్నారి మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి చేసి తల్లిదండ్రులకు అప్పగించారు.
- స్వగ్రామం కేవీబీపురం మండలం ఓళూరుకు మృతదేహాన్ని తీసుకెళ్లారు.

ఓళూరులో విషాదఛాయలు

చిన్నారి మృతి విషయం తెలియగానే వారి స్వగ్రామం కేవీబీపురం మండలం ఓళూరులో విషాదఛాయలు అలుముకున్నాయి. మానవత్వం లేకుండా పసిబిడ్డపై దారుణానికి ఒడిగట్టిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం గ్రామానికి తీసుకువచ్చిన చిన్నారి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించి కన్నీటి వీడ్కోలు పలికారు.



చిన్నారి తల్లిని ఓదారుస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా



చిన్నారి తల్లిదండ్రులకు భరోసా కల్పిస్తున్న టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి



చిన్నారి తల్లిని ఓదారుస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి



చిన్నారి మృతదేహాన్ని చూసేందుకు ఆస్పత్రిలోకి వెళ్లకుండా మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామిని అడ్డుకుంటున్న పోలీసులు



పుత్తూరు ప్రభుత్వాస్పత్రి ఎదుట గుమికూడిన గ్రామస్తులు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు



చిన్నారిని పాశవికంగా హతమార్చిన స్థలం

నిరంతర వైద్య విద్యపై అవగాహన సదస్సు

- పవర్ పాయింట్ ప్రజెంటేషన్

తిరుపతి తుడా: స్విమ్స్ ఆస్పత్రి అనాటమీ, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, జనరల్ సర్జరీ, ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగాల సంయుక్తంగా శనివారం పద్మావతి ఆడిటోరియంలో నిరంతర వైద్య విద్యపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అనాటమీ విభాగాధిపతి డాక్టర్ వి శ్రీకాంత్, ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వి హరిప్రసాద్, జనరల్ సర్జరీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రోహిణి కుమార్, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రమౌళీశ్వరన్ వ్యాధుల సంక్రమణ, శస్త్ర చికిత్స తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ ముక్తేశ్వరయ్య, డాక్టర్ శ్రీహరి రావు, గ్యాస్ట్రో ఎంటరాలజీ డాక్టర్ వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 3,385 మందికి అందని పింఛన్

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 3,385 మంది లబ్ధిదారులు పింఛన్లకు దూరమయ్యారు. శనివారం రాత్రి అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. నవంబర్ నెల పింఛన్ల పంపిణీలో చిత్తూరు జిల్లాలో 99.34 శాతం, తిరుపతి జిల్లాలో 99.39 శాతం నమోదైంది. చిత్తూరు జిల్లాలో 2,68,021 మందికి పింఛన్లు మంజూరు చేయగా ఇందులో 2,66,258 మందికి అందజేశారు. అలాగే తిరుపతి జిల్లాలో 2,65,488 మందికి గాను 2,63,866 మందికి మాత్రమే పంపిణీ చేశారు. చిత్తూరులో 1,763 మందికి, తిరుపతిలో 1,622 మందికి పింఛన్ అందలేదు. శనివారం రాత్రి 12 గంటలు దాటితే లబ్ధిదారులు పింఛన్ తీసుకునేందుకు ఎలాంటి అవకాశం ఉండదని అధికారులు వెల్లడిస్తున్నారు.

భూమన ప్రమాణ స్వీకారం నేడే



ప్రమాణస్వీకారోత్సవానికి ముమ్మరంగా సాగుతున్న ఏర్పాట్లు



భూమన కరుణాకరరెడ్డి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు
- తిరుపతిలో భారీ బహిరంగ సభ
- ఏర్పాట్లు పరిశీలించిన చెవిరెడ్డి

తిరుపతి రూరల్ : చిత్తూరు, తిరుపతి జిల్లాకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా భూమన కరుణాకరరెడ్డి ఆదివారం ఉదయం 10 గంటలకు పదవీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ మేరకు తిరుపతి శివారులోని 150 అడుగుల జాతీయ రహదారికి సమీపంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు తరలిరానున్నారు. రాష్ట్రంలో పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత తొలిసారిగా నిర్వహిస్తున్నబహిరంగ సభ కావడంతో రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఏర్పాట్లు సిద్ధం చేశారు. తుడా మాజీ చైర్మన్ మోహిత్ రెడ్డితో కలిసి శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సభా స్థలి వద్దే ఉంటూ ఏర్పాట్లను పర్యవేక్షించారు. బహిరంగ సభకు తరలివచ్చే పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రముఖులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా సర్వం సిద్ధం చేస్తున్నారు.

హాజరు కానున్న అతిరథ మహారథులు

భూమన కరుణాకరరెడ్డి ప్రమాణ స్వీకారమహోత్సవానికి వైఎస్సార్‌సీపీ నుంచి అతిరథ మహారథులు హాజరుకానున్నారు. అలాగే జిల్లా నలుమూలల నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పెద్దసంఖ్యలో తరలిరావాలని చెవిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే బహిరంగ సభను పూర్తి స్థాయిలో విజయ వంతం చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

బాబు పాలన సూపర్ ఫ్లాప్

- పథకాల అమలులో విఫలం
- వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు సహించం
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పెళ్లకూరు : ముఖ్యమంత్రి చంద్రబాబు ఐదు నెలల పాలన సూపర్ ఫ్లాప్ అని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. ఇటీవల చిల్లకూరు వడ్డిపాళెంలో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బండి చెంచయ్య(38) కుటుంబ సభ్యులకు డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి వితరణగా అందించిన రూ.లక్ష చెక్‌ను ఎంపీ గురుమూర్తి, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యతో కలిసి అందజేశారు. కాకాణి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ పేరుతో వైఎస్సార్ సీపీ కార్యకర్తలను పొట్టనబెట్టుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు కూటమి పాలనలో 77మంది మహిళలపై లైంగిక దాడులు జరిగినట్లు వెల్లడించారు. చంద్రబాబు భయపెట్టాలని చూస్తే ఎదురు తిరిగి పోరాడతామని స్పష్టం చేశారు. రెడ్‌బుక్‌లో మూడో చాప్టర్ ఓపెన్ చేస్తామంటున్న లోకేష్ మరో 30 చాప్టర్లు ఓపెన్ చేసినా వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను ఏమీ చేయలేరని స్పష్టం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ మూడు పార్టీలు కలిసినప్పటికి 40శాతం ఓటు బ్యాంక్‌తో వైఎస్సార్‌సీపీ బలంగా ఉందని తెలిపారు. ఈవీఎంలు ట్యాంపరింగ్ వల్లే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలను చంద్రబాబు మోసం చేశారని విమర్శించారు. ఈ 5 నెలల కూటమి పాలనతో ప్రజలు విసుగెత్తిపోయారని, రాబోయే ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డికే పట్ట కడతారని స్పష్టం చేశారు.



బాధిత కుటుంబానికి చెక్కు అందిస్తున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీ గురుమూర్తి, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి

నిష్పక్షపాతంగా రీపోస్టుమార్టం చేయాలి

చిల్లకూరు వడ్డిపాళెంలో అనుమానస్పద స్థితిలో మృతిచెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త బండి చెంచయ్య మృతదేహానికి నిష్పక్షపాతంగా రీ పోస్టుమార్టం నిర్వహించాలని ఎంపీ గురుమూర్తి డిమాండ్ చేశారు. కూటమి పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు విమర్శించారు.

పోలీసుల సాక్షిగా దాడులు

రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన అంటూ పోలీసుల సాక్షిగా కూటమి నేతలు అమాయకులపై దాడులకు పాల్పడుతున్నట్లు మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆరోపించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి నివాసం వద్ద పోలీస్ పికెట్ ఉన్నప్పటికీ దాడులు, దౌర్జన్యాలు జరిగాయన్నారు. ఈక్రమంలోనే కార్యకర్తలను కూడా హతమార్చుతున్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. గతనెల 24న పోస్టుమార్టం నిర్వహించినప్పటికి రిపోర్టు వెల్లడించకపోవడానికి కారణం ఏంటని ప్రశ్నించారు.

ప్రజా ఉద్యమానికి సిద్ధం

ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను కూటమి ప్రభుత్వం అమలు చేయకుంటే ప్రజా ఉద్యమానికి సిద్ధమవుతామని డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి హెచ్చరించారు. ఇప్పటి వరకు సూపర్ సిక్స్ పథకాలు అమలు కాలేదని విమర్శించారు. ఊరూరా మద్యం బెల్టు షాపులు జోరుగా నిర్వహిస్తున్నా అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు. ఇసుక, మట్టి, గ్రావెల్ అక్రమంగా తరలించుకుంటూ జేబులు నింపుకుంటున్న కూటమి నేతలకు, కార్యకర్తలకు ప్రజలే బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు ప్రిస్కిల్లా, ఎంపీపీ ధనలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నేతలు హరిబాబురెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, జయరామయ్య, నాగార్జున్, మాధవరెడ్డి, రవి, రమణారెడ్డి, రత్నశ్రీ, జితేంద్ర, మోహన్, బాలు, కృష్ణయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

పరిశ్రమలో ప్రమాదం.. కార్మికుడి మృతి

గూడూరు రూరల్: గూడూరు రూరల్ పరిధిలోని ఓ పరిశ్రమలో శనివారం జరిగిన ప్రమాదంలో ఓ కార్మికుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. చవటపాళెం సమీపంలోని ఓ పరిశ్రమ కోర్ మిషన్ వద్ద పనిచేస్తుండగా ఒక్కసారిగా మిషన్ ఆన్ కావడంతో గోపి (33) అనే కార్మికుడి తలకు తీవ్ర గాయమైంది. వెంటనే సహచర కార్మికులు పరిశ్రమ అంబులెన్స్‌లో అతనిని గూడూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అతను అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. గోపి శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరుకు చెందిన వాడని, అతను కొన్ని సంవత్సరాలుగా పరిశ్రమలో పనిచేస్తున్నాడు. రూరల్ పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

తండ్రిని చంపిన తనయుడి అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

వాకాడు : తండ్రిని హత్య చేసిన కేసులో నిందితుడు రమేష్‌ని శనివారం అరెస్ట్ చేసినట్లు సీఐ హుస్సేన్‌బాషా తెలిపారు. ఆయన మాట్లాడుతూ వాకాడు మండలం పులింజేరివారిపాళెం గ్రామానికి చెందిన తుపాకుల చినరామయ్యను కుటుంబ గొడవల్లో కన్న కొడుకే హతమార్చినట్లు వెల్లడించారు. ఈ మేరకు పరారీలో నిందితుడిని ఊరి శివారులోని జామాయిల్ తోటలో అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. సమావేశంలో ఎస్ఐ నాగబాబు పాల్గొన్నారు.

బండరాయితో కొట్టి హత్య

శ్రీకాళహస్తి : స్నేహితుడిని బండరాయితో కొట్టి హత్య చేసిన ఘటన శుక్రవారం రాత్రి తొట్టంబేడు మండలం శివనాథపురంలో జరిగింది. ఎస్ఐ ఈశ్వరయ్య కథనం మేరకు.. గ్రామానికి చెందిన నాగరాజు(28) రాజేష్ స్నేహితులు. సెంట్రింగ్ పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో నాగరాజు మద్యానికి బానిసగా మారాడు. ఈ కారణంగా భార్యతో తరచూ గొడవపడేవాడు. శుక్రవారం రాత్రి కూడా మిత్రుడు రాజేష్‌తో కలిసి పూటుగా తాగేసి ఇంటికి రాగా భార్యాభర్తలకు గొడవైంది. ఇందులో రాజేష్ జోక్యం చేసుకుని సర్దిచెప్పేందుకు యత్నించగా నాగరాజు దురుసుగా ప్రవర్తించాడు. దీంతో ఆగ్రహం పట్టలేక రాజేష్ పక్కనే ఉన్న బండ రాయితో మోదడంతో నాగరాజు అక్కడికక్కడే మరణించాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు రాజేష్ పరారీలో ఉన్నాడని, త్వరలోనే అరెస్ట్ చేస్తామని పోలీసులు వెల్లడించారు. అయితే నాగరాజు హత్యకు వివాహేతర సంబంధం కారణమా అనే కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.



తిరుపతి బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.80,820
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.7,370
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.96,700
రిటైల్ వెండి గ్రాము	రూ.99.70

ఖాళీ జాగా.. కనిపిస్తే పాగా!



గుట్ట తవ్వేసి గ్రావెల్‌ను తరలించి చదును చేసిన దృశ్యం

ఎన్నికల సమయంలో టీడీపీ నేతలు చిలక పలుకులు పలికారు. అవినీతికి తావులేని పారదర్శకమైన పాలన అందిస్తామని ఊదరగొట్టారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి కబ్జాలు, దౌర్జన్యాలే పరమావధిగా ముందుకు వెళుతున్నారు. ఖాళీ జాగా కనిపిస్తే.. వెంటనే అక్కడ పాగా వేసేస్తున్నారు. ఇష్టారాజ్యంగా ఆక్రమణలకు పాల్పడుతున్నారు. అందులో భాగంగానే చంద్రగిరి పంచాయతీలోని ఇందిరమ్మ కాలనీలో యథేచ్ఛగా భూ దందా సాగిస్తున్నారు. నకిలీ పత్రాలు సృష్టించి అధికారులను మామూళ్ల మత్తులో ముంచి భూ కబ్జాలు చేస్తున్నారని స్థానికులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు.

- ఇందిరమ్మ కాలనీలో టీడీపీ నేతల భూ దందా
- అక్రమార్జనే ధ్యేయంగా ఆక్రమణలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- తూతూ మంత్రంగా హెచ్చరిక బోర్డులు

చంద్రగిరి : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో చంద్రగిరి వద్ద జాతీయ రహదారి పక్కనే ఇందిరమ్మ కాలనీలో పేదలకు మంజూరు చేసిన భూమిపై పచ్చనేతల కన్ను పడింది. ఆర్థిక పరిస్థితి బాగోలేక ఇప్పటికీ ఇల్లు నిర్మించుకోని ప్లాట్లను టీడీపీ నేతలు ఆక్రమించేస్తున్నారు. నకిలీ పత్రాలను సృష్టించి రాత్రికి రాత్రి నిర్మాణాలను ప్రారంభిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై ప్రశ్నిస్తే దౌర్జన్యానికి సైతం వెనుకాడడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. ముందుగా ఖాళీ జాగాను చదును చేసి చిన్నపాటి షెడ్‌ను ఏర్పాటు చేస్తారని, తర్వాత ప్రహరీ గోడ నిర్మించేస్తారని వెల్లడిస్తున్నారు. దీనిపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే రెవెన్యూ అధికారుల సాయంతో కబ్జాలు కొనసాగిస్తున్నారని విమర్శిస్తున్నారు.

గ్రావెల్ తరలింపుతో ప్రారంభించి..!

ఇందిరమ్మ కాలనీ వెనుక వైపున ఓ గుట్ట ఉంది. దీనిపై టీడీపీ నేతలు కన్నేశారు. ముందుగా గ్రావెల్‌ను తవ్వేసి అమ్మేసుకున్నారు. దీంతో గుట్ట కాస్తా చదునుగా మారిపోయింది. తర్వాత ఆ భూమిని కూడా నకిలీ పత్రాలతో ఆక్రమించేసుకున్నారు. వెంటనే అక్రమ నిర్మాణాలు సైతం చేపట్టారు. ప్రస్తుతం ఇక్కడ ఒక్కో ప్లాట్‌ను రూ.6లక్షల చొప్పున విక్రయిస్తున్నట్లు సమాచారం.



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు

వైరల్ అయితే కంటితుడుపు చర్యలు

టీడీపీ నేతల ఆక్రమణలపై సోషల్ మీడియాలో వైరల్ అయిన తర్వాతే రెవెన్యూ అధికారులు స్పందిస్తున్నారు. ఆయా స్థలాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి చేతులు దులిపేసుకుంటున్నారు. మామూళ్ల కోసం అధికారులే టీడీపీ నేతలు సహకరిస్తున్నట్లు స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పోలీసుల నిర్లక్ష్యంపై ఆవేదన



బాధితుడు సుబ్బరాయులు

నాయుడుపేటటౌన్ : తన ఏటీఎం కార్డును అపహరించి పలుమార్లుగా మొత్తం రూ.44వేల నగదు గుర్తుతెలియని వ్యక్తి విత్‌డ్రా చేశారని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఓజిలి మండలం పెద్దపరియకు చెందిన విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి పారిచర్ల సుబ్బరాయులు ఈ మేరకు శనివారం వివరాలు వెల్లడించాడు. జూలై 3వ తేదీన ఏటీఎం కార్డు చోరీకి గురైందన్నారు. అదే రోజు నాయుడేపేట బజారువీధిలోని ఓ ఏటీఎం నుంచి రూ.7వేలు డ్రా చేశారని చెప్పారు. అదే నెల 7 తేదిన రెండు పర్యాయాలు అదే ఏటీఎంలో రూ.18 వేలు నగదు డ్రా చేసినట్లుగా గుర్తించి పోలీసులు, బ్యాంక్ అధికారులకు సైతం ఫిర్యాదులు చేసినట్లు తెలిపారు. మళ్లీ అక్టోబర్ 3 తేదీన నాయుడుపేట పాత బస్టాండు వద్ద ఉన్న ఏటీఎం వద్ద రెండు సార్లు రూ.19 వేలు నగదు డ్రా చేసినట్లు వెల్లడించారు. అయినప్పటికీ పోలీసులు ఏమాత్రం స్పందించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు.

4న రీ పోస్టుమార్టం



చెంచయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు(ఫైల్)

పెళ్లకూరు : అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బండి చెంచయ్య అలియాస్ పోతురాజు(38) మృతదేహానికి ఈనెల 4వ తేదీన రీ పోస్టుమార్టం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అక్టోబర్ 23న చిల్లకూరు వడ్డిపాళెం సమీపంలోని స్వర్ణముఖినది ఒడ్డున చెంచయ్య అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అయితే తన భర్త హత్యకు గురైనట్లు అనుమానించి భార్య బండి ప్రమీల హైకోర్టును ఆశ్రయించి రీపోస్టుమార్టం చేసి నిగ్గు తేల్చాలని కోరింది. హైకోర్టు ఆదేశాల మేరకు తిరుపతి స్విమ్స్ ఆస్పత్రి వైద్యులతో రీపోస్టుమార్టం నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి సైతం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

దారి దోపిడీ దొంగల ముఠా అరెస్టు

ఐరాల: జాతీయరహదారిలో ఒంటరిగా వెళుతున్న వ్యక్తుల వద్ద నగదు, ఫోన్‌లు, ద్విచక్రవాహనాలను దోపిడీ చేస్తున్న దొంగల ముఠాను కాణిపాకం పోలీసులు అరెస్టు చేశారు. కాణిపాకం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను చిత్తూరు వెస్ట్ సీఐ శ్రీధర్‌నాయుడు, కాణిపాకం ఎస్ఐ ధరణీధర శనివారం వెల్లడించారు. తిమ్మాజిపల్లెకు చెందిన వెంకటముని గత నెల 29వ తేదీ రాత్రి బొమ్మసముద్రం ఫ్లై ఓవర్‌పై బైక్‌లో వెళుతున్నాడు. ఈ క్రమంలో బైక్‌పై ఇద్దరు వ్యక్తులు వచ్చి ఆయన్ని అడ్డగించి దాడి చేసి బైక్‌తోపాటు రూ.16 వేలు నగదు, ఒక మొబైల్ ఫోన్ దోపిడీ చేసినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం ఎం.పైపల్లె హైస్కూల్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించిన చిత్తూరు నగరం జానకారపల్లెకు చెందిన సింగమలై(23), రజిని(49)ను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.2.38 లక్షల విలువ చేసే ఒక మొబైల్ ఫోన్, నాలుగు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని, నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

4 నెలలకు ఒక సిలిండర్

తిరుపతి అర్బన్ : దీపం–2 పథకం కింద అర్హులైన వారికి ప్రతి నాలుగు నెలలకు ఒక గ్యాస్ సిలిండర్‌ను ఉచితంగా అందిస్తున్నట్లు పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. శనివారం తిరుపతి చెన్నారెడ్డి కాలనీలోని మున్సిపల్ ప్రైమరీ స్కూల్‌లో సిలిండర్ల పంపిణీ ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ ఏడాదికి మూడు సిలిండర్లు మాత్రమే ఇస్తామని స్పష్టం చేశారు. ముందుగా లబ్ధిదారులు నగదు చెల్లించాలని..తర్వాత 48 గంటల్లో ఆ నగదు మీ ఖాతాల్లోకి జమ అవుతుందని చెప్పారు. జేసీ శుభం బన్సల్ మాట్లాడుతూ ఈ కేవైసీ ఇబ్బందులు ఉంటే ముందుగానే పరిష్కరించుకోవాలని కోరారు. సభకు హాజరైన మహిళలు ఒక సిలెండర్ నాలుగు నెలలు వస్తుందా అంటూ చర్చించుకోవడం గమనార్హం.

వేదికను ఆక్రమించిన కూటమి నేతలు

- దూరంగా సివిల్ సప్లయ్ అధికారులు



వేదికపై మంత్రితో పాటు కొలువుదీరిన కూటమి నేతలు

దీపం–2 పథకం ప్రారంభోత్సవంలో కూటమి నేతలు ప్రోటోకాల్ ఉల్లంఘనకు పాల్పడ్డారు. వాస్తవానికి ప్రభుత్వ కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్ పక్కన పౌరసరఫరాశాఖ అధికారులు ఉండాలి. అయితే వేదికను కూటమి నేతలు ఆక్రమించుకోవడంతో అధికారులు దూరంగా నిలబడాల్సి వచ్చింది. ఉచిత గ్యాస్ సిలెండర్ల పంపిణీలో మంత్రికి కుడి వైపున టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్, ఎడమ వైపున జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్ కూర్చున్నారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ మౌర్య కాస్త దూరంగా కూర్చువాల్సి వచ్చింది. మరోవైపు సివిల్ సప్లయ్ జిల్లా అధికారి శేషాచలం రాజు,మేనేజర్ వై. సుమతితోపాటు పలువురు ఉద్యోగులు వేదికకు దూరంగా ఉండిపోయారు. ప్రభుత్వ కార్యక్రమంలో అధికారులకు తొలి ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉండగా పార్టీ నేతలు పెత్తనం చేయడం ఎంటీ అంటూ గుసగుసలు వినిపించాయి. మంత్రి పదే పదే తమ పార్టీ క్రమశిక్షణకు మారుపేరు అంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్న నేపథ్యంలో ప్రొటోకాల్ పాటించాల్సిన సంగతి మరచిపోయినట్లు ఉన్నారంటూ పలువురు మాట్లాడుకుంటున్నారు.

పాత కక్షలతోనే యువకుడి హత్య



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

చిల్లకూరు : మండలంలోని కడివేడు దళితవాడకు చెందిన ఎర్రిపాక వెంకటేష్(30) పాత కక్షల కారణంగానే హత్యకు గురైనట్లు డీఎస్పీ రమణకుమార్ తెలిపారు. శనివారం చిల్లకూరు పోలీస్ స్టేషన్‌లో ఆయన నిందితులను మీడియా ముందు ప్రవేశ పెట్టి పూర్తి వివరాలు వెల్లడించారు. డీఎస్పీ మాట్లాడుతూ వెంకటేష్ హైదరాబాద్‌లో ఉద్యోగం చేసుకుంటూ అప్పుడప్పుడు ఊరికి వచ్చేవాడు. ఈ క్రమంలో గ్రామంలోని పాటేళ్ల సుబ్రమణ్యం అనే యువకుడితో విబేధాలు మొదలయ్యాయి. వెంకటేష్‌తో ఎప్పటికైనా ఇబ్బంది వస్తుందని సుబ్రమణ్యం తన స్నేహితులైన పల్లిపాటి సాయికుమార్, సూళ్లూరు సునీల్‌తో అనేవాడు. దీంతో వెంకటేష్‌ను హతమార్చాలని పథకం వేశారు. ఇదే సమయంలో దీపావళి సందర్భంగా ఇంటికి వచ్చిన వెంకటేష్ మరో ముగ్గురితో కలిసి మద్యం తాగుతుండగా సుబ్రమణ్యం అతడి మిత్రులు ఒక్కసారిగా దాడికి దిగారు. కళ్లలో కారం కొట్టి సుబ్రమణ్యం తలపై రాడ్ సుత్తితో కొట్టారు. దీంతో సుబ్రమణ్యం అక్కడిక్కడే మృతి చెందాడు. తర్వాత నిందితుడు బైక్‌పై పరారయ్యారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేపట్టారు. కోట క్రాస్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి హత్యాయుధాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. కేసు ఛేదించిన గూడూరు రూరల్ సీఐ కిశోర్ బాబు, ఎస్ఐ సురేష్ బాబు, సిబ్బంది రాజు, విష్ణు, భాస్కర్, రఫీని అభినందించారు.

మానవ మృగాన్ని శిక్షించండి

పుత్తూరు: వడమాలపేట మండలం ఏఎం పురం ఎస్టీ కాలనీలో జరిగిన ఘోరం సభ్యసమాజం తలదించుకునేలా ఉందని, ఇందుకు కారకుడైన మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాలు పిలుపునిచ్చాయి. శనివారం పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలిపారు. ఐద్వా కార్య దర్శి సాయిలక్ష్మి మాట్లాడుతూ మూడున్నరేళ్ల చిన్నారిపై లైంగిక దాడి చేసి, హతమార్చడం అత్యంత అరాచక చర్య అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు అక్బర్, రవి, వినోద్, నరేంద్ర, హర్షద్, గణేష్, సీఐటీయూ నాయకులు వెంకటేష్ పాల్గొన్నారు.

కిక్కిరిసిన 'కొండ'







- శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండిపోయాయి. క్యూ ఏటీజీ హెచ్ వద్దకు చేరుకుంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 67,785 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 27,753 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.2.38 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 20 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది. ఈ క్రమంలోనే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయం కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించమని స్పష్టం చేసింది. అనూహ్యంగా పెరిగిన భక్తుల రద్దీకి అనుగుణంగా టీటీడీ ఏర్పాట్లు చేపట్టింది. శ్రీవారి భక్తులకు ఎప్పటికప్పుడు పాలు, అన్న ప్రసాదం అందజేస్తోంది. అద్దె గదులు దొరకకపోవడంతో పెద్దసంఖ్యలో భక్తులు తీవ్రమైన చలితో ఇబ్బంది పడుతున్నారు.

- తిరుమల